ప్రజాశక్తి
సోమవారం 27 మార్చి 2023
5
అల్లూరి సీతారామరాజు

టెన్త్ విద్యార్థులు భయం వీడాలి

ప్రజాశక్తి- పెదబయలు: స్థానిక బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో ఆదివారం గిరిజన గురుకులం డిప్యూటీ సెక్రటరీ రామ్మోహన్ రెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం పది నుండి 5వ తరగతి వరకు విద్యార్థులను ఆంగ్ల మాధ్యమం చదివించారు. 8వ తరగతి విద్యార్థులకు ఇటీవల ప్రభుత్వం పంపిణీ చేసిన ట్యాబ్స్ వినియోగంపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయుల హాజరు, రికార్డ్స్ పరిశీలించారు. టెన్త్ విద్యార్థులకు శత శాతం ఫలితాలు సాధించడం ఎలా? పరీక్షలు ఎలా రాస్తే మంచి మార్కులు సాధించవచ్చు, భయాన్ని వీడటం తదితర అంశాలపై సూచనలు, సలహాలు విద్యార్థులకు సూచించారు. స్థానిక ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు డిప్యూటీ సెక్రటరీ శ్రీరాం మోహన్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. గిరిజన గురుకులాల్లో పని చేస్తున్న తమకు వేతనాలు పెంచలేదన్నారు. పెరుగుతున్న ధరల కనుగుణంగా వేతనాలు పెంచాలన్నారు.

మాట్లాడుతున్న రాంమోహన్‌రెడ్డి

ఉత్తమ ఫలితాలకు యాక్షన్‌ప్లాన్

▶▶ టెన్త్ విద్యార్థులకు స్టడీ అవర్స్, పరీక్షలు
▶▶ శత శాతం ఉత్తీర్ణులకు ప్రత్యేక శ్రద్ధ

విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్న ఉపాధ్యాయుడు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు జరగనుండగా యంత్రాంగం సంబంధిత ఏర్పాట్లలో నిమగ్నమైంది. కరోనా నేపథ్యంలో గత మూడేళ్లుగా పరీక్షలు సవ్యంగా నిర్వహించలేదు. మహమ్మారి తగ్గుముఖం పట్టడంతో ఈ విద్యా సంవత్సరం పాఠశాలలను అనుకున్న సమయానికి తెరిచారు. తరగతుల నిర్వహణ ద్వారా సిలబస్ సైతం పూర్తి చేశారు. ఆ నేపథ్యంలో పరీక్షల పకడ్బందీ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఆయా మండలాల ఐటిడిఏ, ఆశ్రమ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉన్నతాధికారుల సమీక్షలు పూర్తయ్యాయి. గతేడాది పదిలో కేవలం 68 శాతం ఉత్తీర్ణత సాధించగలిగారు. ఈ ఏడాది పదిలో శత శాతమే లక్ష్యంగా హెచ్‌ఎంలు, ఆయా సబ్జెక్ట్‌ల ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని ఐటిడిఏ పిఒ ఆర్.గోపాలకృష్ణ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. జిటిడబ్ల్యు ఆశ్రమ పాఠశాలల్లో 57 రోజుల ప్రత్యేక ప్రణాళిక అమలుకు పాడేరు డివిజన్ స్థాయిలో టిడబ్ల్యు డిడి ఐ.కొండలరావు, మండల స్థాయిలో ఏటిడబ్ల్యుఓలు, పాఠశాల స్థాయిలో హెచ్‌ఎంలు, ఆయా సబ్జెక్ట్ టీచర్స్ కృషి చేస్తున్నారు. టీచర్స్ తమ నైపుణ్యాలను ప్రదర్శిస్తూ విద్యార్థులను తీర్చిదిద్దుతూ పదో తరగతి పరీక్షల్లో శత శాతం సాధించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. పాఠశాలల్లో విద్యార్థులు తమ ప్రతిభను పదును పెట్టేలా రేయి, పగలు కష్టపడి చదువుతున్నారు.

ఐటిడిఏ పరిధిలోని పాడేరు డివిజన్ 11 మండలాల వ్యాప్తంగా 5,013 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు సిద్ధమవుతుండగా 39 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేశారు. 106 జిటిడబ్ల్యు ఆశ్రమ పాఠశాలల్లోని 2,225 బాలురు, 2,788 బాలికలు మొత్తం 5,013 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు సిద్ధమవుతున్నారు. పరీక్షల్లో ప్రత్యేక నిఘా, సిసి కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. నిర్వహణపై ఇప్పటికే కలెక్టర్, ఐటిడిఏ పిఒ విద్యాశాఖ అధికారులతో సమీక్షించారు. విద్య, రెవెన్యూ, పోలీస్, విద్యుత్, వైద్య ఆరోగ్య తదితర శాఖల సమన్వయంతో ఎలాంటి అవంతరాలు లేకుండా పరీక్షలు పూర్తి చేయాలని నిర్ణయించారు.

యాక్షన్ ప్లాన్ అమలు..

ఐటిడిఏ కార్యాలయం విడుదల చేసిన యాక్షన్ ప్లాన్ ఫిబ్రవరి 1వ తేదీ నుంచి అమలు చేస్తున్నామని, దీంతో మంచి ఫలితాలు సాధిస్తున్నామని తలారిసింగి జిటిడబ్ల్యు పాఠశాల హెచ్‌ఎం, సబ్జెక్ట్ టీచర్లు చెబుతున్నారు. పాఠశాలలో 89 మంది పదో తరగతి విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. గతేడాది కంటే ఈ ఏడాది పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించడానికి టీచర్స్ ప్రత్యేక తరగతులతో పాటు, స్టడీ అవర్స్, రోజు ఉదయం, సాయంత్రం పరీక్షలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులను దగ్గరుండి చదివిస్తూ, వారి సందేహాలు నివృత్తి చేస్తున్నారు. శత శాతం పాఠశాల విద్యార్థులు ఉత్తీర్ణులు కావాలని టీచర్స్ ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. రోజు రోజుకూ విద్యార్థుల్లోని ప్రతిభ మెరుగు పరుస్తూ, మంచి మార్కులు వచ్చేలా సన్నద్ధం చేస్తున్నారు.

శత శాతం ఫలితాలకు చర్యలు..

- సమ్మేటివ్, ఫార్మేటివ్ పరీక్షలు ఫలితాలు ఆధారంగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి తర్ఫీదు ఇస్తున్నారు. పది పరీక్షలు అంటే విద్యార్థుల్లో ఎంతో భయం ఆ భయాన్ని పోగొట్టి ప్రతి ఒక్కరూ ఉత్తీర్ణత సాధించేలా మానసిక స్థైర్యాన్ని నింపేలా అందుకు తగిన సూచనలు చేస్తున్నారు. నిపుణులు తయారుచేసిన మాదిరి ప్రశ్న పత్రాలతో సాధన చేయించడం. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా సిద్ధం చేస్తున్నారు. జనవరి నెలాఖరుకు అన్ని సబ్జెక్టులకు సంబంధించిన సిలబస్ ను పూర్తి చేయడం. ప్రతిరోజు ఉదయం ఒక గంట రాత్రి రెండు గంటలు ప్రత్యేక స్టడీ అవర్ నిర్వహిస్తున్నారు. ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి సబ్జెక్టుల రివిజన్, ఫిబ్రవరి, మార్చి నెలల్లో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో డైలీ టెస్ట్ లు పెడుతున్నారు. ప్రతిరోజు ఆయా సబ్జెక్టులకు సంబంధించి ప్రత్యేకమైన అస్సైన్‌మెంట్లు ఇవ్వడం, రాయించడం చేస్తున్నారు. డైలీ టెస్ట్ లను ఏరోజుకారోజు మూల్యాంకనం చేసి విద్యార్థుల ప్రగతిని అదే రోజు అందరికీ తెలియజేయడం వెనకబాటుతనకు గురైన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. వెనకబడిన విద్యార్థులకు అవసరమైన మార్కులు వచ్చేలా ఆయా అంశాలపై ప్రత్యేక తరగతులను బోధించడం, అలాగే విద్యార్థులపై సబ్జెక్ట్ టీచర్లు ప్రత్యేక దృష్టి పెట్టి పరీక్షల సమయానికి వారి స్థాయిని పెంచుతున్నారు. వార్షిక పరీక్షలపై విద్యార్థులకు భయం పోగొట్టేలా డైలీ టెస్ట్ ల ద్వారా వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతున్నారు. 57 రోజుల ప్రత్యేక ప్రణాళిక విషయంలో విద్యార్థుల గైర్హాజరు కాకుండా చూడడంతో పాటు వారిపై ఉపాధ్యాయులు నిత్య పర్యవేక్షణ చేస్తున్నారు.

యాక్షన్ ప్లాన్‌తో అధిక ప్రయోజనం

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పది పరీక్షల్లో యాక్షన్ ప్లాన్‌తో అద్భుత ఫలితాలు తెచ్చేందుకు కృషి చేస్తున్నాం. సిలబస్ పూర్తి చేసి యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నాం. విద్యార్థులపై ఎలాంటి ఒత్తిడి లేకుండా తగు జాగ్రత్తలతో మంచి నాణ్యమైన బోధనలతో సిద్ధం చేస్తున్నాం. అధికారులు నిత్యం పర్యవేక్షిస్తున్నారు.

రీమల జాన్, హెచ్‌ఎం
జిటిడబ్ల్యు ఆశ్రమ బాలుర పాఠశాల
తలారిసింగి

స్టడీ అవర్స్‌తో ప్రయోజనం

స్టడీ అవర్స్ తో చాలా ప్రయోజనం ఉంది. చదువుతుండగానే ఎక్కువ సందేహాలు వస్తుంటాయి. వాటిని అప్పుడే మా టీచర్స్ నివృత్తి చేస్తుంటారు. ప్రతిరోజు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ తరగతుల్లో మా నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటూ పరీక్షల్లో మంచి మార్కులు సాధించి ఉత్తీర్ణత సాధించాలని పట్టుదలతో చదువుతున్నాం.

కె.కార్తీక్
పదో తరగతి విద్యార్థి
జిటిడబ్ల్యు ఆశ్రమ బాలుర పాఠశాల,తలారిసింగి

బోయ/ వాల్మీకిలకు ఎస్‌టి రిజర్వేషన్‌తో
ఆదివాసీల మనుగడకు పెనుముప్పు

కూనవరంలో గిరిజన సంఘం ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి- కూనవరం: బోయ/వాల్మీకి, బెంతు కులాలను ఎస్‌టి జాబితా నుంచి తొలగించాలని గిరిజన సంఘం నేతలు కోరారు. బోయ/ వాల్మీకి, బెంతు ఒరియా కులాలను ఎస్‌టిజాబితాలో చేరుస్తూ అసెంబ్లీలో చేసిన తీర్మానానికి నిరసిస్తూ ఆదివారం రేపాక గ్రామంలో కొమరం పెంటయ్య ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈసందర్భంగా గిరిజన సంఘం మండల కార్యదర్శి బొర్రయ్య మాట్లాడుతూ నిజమైన గిరిజన హక్కులు కాలరాసేలా వైసిపి ప్రభుత్వం వ్యవహరించడం దుర్మార్గమని, అసెంబ్లీలో దీనిపై తీర్మానం చేస్తుంటే గిరిజన ఎమ్మెల్యేలు మౌనంగాఉ ండడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజన హక్కులు పరిరక్షించలేని గిరిజన నేతలకు భవిష్యత్ ఉండదని హెచ్చరించారు. అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని ఉపసంహరించకుంటే పోరాటం ఉధృతం చేయకతప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య, గిరిజన సంఘం నాయకులు పాయం సీతారామయ్య, సర్పంచ్ నాగమణి, పోడియం రామారావు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు వైసిపి అండ

సాయం అందజేస్తున్న వైసిపి నేతలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని వాతంగి పంచాయతీ కొమరాపురం గ్రామంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో తాటాకిల్లు దగ్ధమై సర్వం కోల్పోయి వీధిన పడిన బాధిత కుటుంబానికి వైసిపి మండల కన్వీనర్, సొసైటీ అధ్యక్షులు సింగిరెడ్డి రామకృష్ణ ఆధ్వర్యంలో వైసిపి నేతలు ఆదివారం పరామర్శించి, ఆర్థిక సహాయం అందజేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధమై సర్వంకోల్పోయిన గ్రామ వాలంటీర్ లోసుల రాజశేఖర్ కుటుంబానికి బియ్యం, నిత్యావసర సరుకులు, కొంత నగదు వైసిపి నేతలు అందజేసారు.కార్యక్రమంలో సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షులు కొంగర మురళీకృష్ణ, కోఆప్షన్ సభ్యులు అడపా కామేష్ , వాతంగి సర్పంచ్ భీమిరెడ్డి సుబ్బలక్ష్మి, ఎంపిటిసి జుర్రా రాజేశ్వరి, ఉపసర్పంచ్ రాళ్ళగడ్డ అర్జున్, మాజీ సర్పంచ్ జుర్రా జాన్‌బాబు, పార్టీ నాయకులు అప్పాని సత్తిబాబు, దొంగర శ్రీను, కేత వెంకటరమణ, చింతల సుజాత, బొడారపు శివకుమార్, యాళ్ల భాస్కర రావు, యాట్ల ప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

పాడేరులో భారీ వర్షం

ప్రజాశక్తి-పాడేరుటౌన్:అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ముసురు వాతావరణం కొనసాగి, ఆ తర్వాత వాతావరణం మారిపోయింది. మధ్యాహ్నం రెండు గంటల తర్వాత ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. గంటసేపు కురిసిన వర్షానికి పాడేరు పట్టణం తడిచి ముద్దయింది. భారీగా వర్షం కురవడంతో జనజీవనానికి అంతరాయం ఏర్పడింది. అలాగే దూర ప్రాంతాల్లో పిడుగులు పడిన శబ్దాలు వినిపించాయి. ఉరుములతో కూడిన వర్షం పడడంతో జనం ఆందోళనకు గురయ్యారు. భారీ వర్షానికి పట్టణంలోని రోడ్లు వీధులు జలమయమయ్యాయి. చిరు వ్యాపారులు, వీధి వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణాలు సాగించారు.

కురుస్తున్న వర్షం

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

ఆటోడ్రైవర్లతో మాట్లాడుతున్న సిఐ అశోక్‌కుమార్

ప్రజాశక్తి -సీలేరు: వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు తుచ తప్పకుండా ప్రతిఒక్కరూ పాటించాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని సిఆర్‌పిఎఫ్ 42వ బెటాలియన్ డిఎస్‌పి సురేష్, స్థానిక సిఐ అశోక్‌కుమార్, ఎస్ఐ రామకృష్ణ హెచ్చరించారు. ఆదివారం జీకే వీధి మండలం దారకొండ వారపుసంతలో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. అనంతరం ఆటోడ్రైవర్లతో సమావేశం అయ్యారు. ఈ సంధర్భంగా సిఐ అశోక్ కుమార్ మాట్లాడుతూ వాహనాలు నడిపే ప్రతిఒక్కరికీ డ్రైవింగ్ లైసెన్స్, బీమా, వాహనపత్రాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఆటో డ్రైవర్లు యూనిఫాం ధరించడంతోపాటు నిబంధనలు పాటిస్తూ వాహనాన్ని నడపాలన్నారు. అతివేగంతో, మద్యం మత్తులో వాహనాలను నడిపినట్లు గుర్తించినా, నిబంధనలను అతిక్రమించినా,పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. బైకిస్టులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని మైనర్లకు వాహనాలిస్తే యజమానికి కేసులు పెడతామని హెచ్చరించారు. సిఆర్‌పిఎఫ్, లోకల్ పోలీసులు పాల్గొన్నారు.

ప్రచారం చేపడుతున్న ఉమామహేశ్వరరావు, నాయకులు

5న చలో ఢిల్లీని జయప్రదం చేయండి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:కేంద్రంలో బిజెపి పాలనలో దేశంలోని పేదరికం, నిరుద్యోగం తీవ్రస్థాయిలో పెరుగుతుందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు తెలిపారు.ఆదివారం అరకువేలి మండలం సుంకరమెట్ట వారపు సంతలో కరపత్రాలు పంచుతూ విస్తత ప్రచారం నిర్వహించారు. అనంతరం మాట్లాడారు. మోడీ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5న చలో ఢిల్లీ లక్షల మందితో జంతర్ మంతర్ వద్ద మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా సిఐటియు, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతుందని తెలిపారు.కార్మికులకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, ప్రజా పంపిణీ వ్యవస్థను ప్రతిష్టంగా అమలు చేయాలన్నారు.పండించిన ప్రతీ పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేశారు.గిరిజన ప్రాంతంలో హైడ్రోక్ పవర్ ప్రాజెక్ట్ రద్దు చేయాలని అన్నారు.జీవో 3కు చట్టబద్ధత కల్పించి ఉద్యోగావ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆటో మోటార్ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని తెలిపారు.భవన నిర్మాణ కార్మికులలకు వెల్ఫేర్ బోర్డు, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగించాలన్నారు. కాఫీ రైతుల బకాయిలు ఐటీడీఏ తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. గిరిజన హక్కులు, చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. స్కీం వర్కర్లకుఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి ఉద్యోగులందరికీ రెగ్యులర్ చేయాలని తెలిపారు. దేశంలో ఖాళీగా ఉన్న బ్యాక్లాగ్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలు ప్రైవేటీకరణ తదితర డిమాండ్లపై ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆటో కార్మికులు, జిసిసి కార్మికులు సింహాద్రి, జోషి, కృష్ణ, కాఫీ రైతు సంఘం నాయకులు పాంగి నానిబాబు, ఏపీ గిరిజన సంఘం మండల కార్యదర్శి పాంగి రామన్న, గిరిజన సంఘం నాయకులు టి జోషి పాల్గొన్నారు.

ముచ్చటగొలుపుతున్న మోదుగ పూలు

ప్రజాశక్తి- చింతూరు : మన్యంలో ప్రకృతి అందాలకు కొదవే లేదు. వేసవికాలం తొలినాళ్లలో చింతూరు ఏజెన్సీలో రహదారులకు ఇరువైపులా గుత్తులు గుత్తులుగా ఎర్రని పూలు వికసించిన మోదుగచెట్లు చూడముచ్చటగా, ఆకర్షనీయంగా దర్శనమిస్తాయి.హోలీ రంగేళి పండుగల్లో రంగుల్లో ఈ పూలను కలిపి వసంత వేడుకలు జరుపుకునేవారు. కేవలం వేసవిలో అదీ ఈ ఒక్క మాసంలో మాత్రమే కనిపించే ఎర్రని మోదుగ పూలు, మళ్లీ ఏడాది వరకు కనిపించవు. మోదుగచెట్లకున్న పచ్చని అకులు సైతం కనిపించనంత గుబురుగా పూసిన చెట్లు, అవికాస్తా పక్వానికి చేరిన తర్వాత ఎర్రని తివాచీ పరిచారా అన్నట్లు నల్లని తారురోడ్డుపై గోచరమైన సహజసిద్ధమైన ప్రకృతి దృశ్యాలు ప్రకృతి ప్రేమికులకు కనువిందే కాకుండా మైమరిపింప జేస్తాయనడంతో ఎంత మాత్రం అతిశయోక్తి లేదు.

దినదిన గండం.. ప్రాణ సాహసం!

- ◆ కట్టముడి వాగు పొంగితే రాకపోకలు కట్!
- ◆ జల్లివారిగూడెం, ములకనపల్లి వాసుల అవస్థలు
- ◆ ప్రతి చిన్న అవసరానికి గెడ్డ దాటాల్సిందే..
- ◆ నిధులు మంజూరైనా జరగని వంతెన నిర్మాణం

ప్రజాశక్తి:-విఆర్ పురం : మండలంలోని ములకనపల్లి పంచాయతీ జల్లివారిగూడెం జనం జీవనం దినదినగండం, ప్రాణసాహసంగా ఉందని ఆవేదన చెందుతున్నారు. పంచాయతీ కేంద్రం ములకనపల్లికి జల్లివారిగూడేం మధ్య కట్టుముట్టి వాగు ఉంది. మండువేసవిలో సైతం మోకాలి లోతు కంటే ఎక్కువగానే ఈ వాగు ప్రవహిస్తోంది.ఇక వర్షాలసీజన్‌లో వేరే చెప్పనక్కరలేదు. నాలుగైదు అడుగులకంటే ఎక్కువ లోతులో, ఉధృతంగా ఈ వాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది.

ఇక జల్లివారిగూడెం ప్రజలు అత్యవసరంతోపాటు ప్రతిచిన్న అవసరానికి పంచాయతీ కేంద్రం ములకనపల్లి వెళ్లాల్సిందే. ములకనపల్లి వెళ్లాలంటే కట్టముడివాగు నీటిలో దిగి రాకపోకలు సాగించాల్సిందే. జల్లివారిగూడెం ప్రజలు సచివాలయానికి, ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాలన్నా, ఆ గ్రామ విద్యార్థులు పాఠశాలకు వెళ్లాలన్నా వాగులో దిగి రాకపోకలు సాగించడం నిత్యకృత్యమనే చెప్పాలి. అత్యవసర పరిస్థితుల్లో 108, 104, అంబులెన్స్‌లు వెళ్లేందుకు, ఇతర అవసరాలకు ఈ వాగు ఆయాగ్రామాలకు అడ్డంకిగా ఉంటుందనే చెప్పాలి. మామూలు రోజుల్లో మోకాలి లోతు నీటిలో దిగి వెళ్లడం ఇబ్బందే అయినప్పటికీ, ప్రాణాంతకం మాత్రం కాదు. అదే వర్షాల సీజన్‌లో ఉప్పొంగి, ఉధతంగా ప్రవహించే వాగులో దిగి వెళ్లడం ప్రాణ సాహసమేనని చెప్పకతప్పదు. అయినా తప్పనిసరై వాగును దాటి వెళ్లి వస్తున్నామని ఆయా గ్రామస్తులు వాపోతున్నారు. అపుడపుడూ ప్రమాదాలు జరగడం, ప్రాణాలు కోల్పోవడం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆయా గ్రామాల గిరిజనం ఆందోళనతో చెబుతున్నారు.

జల్లివారిగూడెం వద్ద నున్న కట్టముడి వాగు

నిధులు మంజూరైనా జరగని వంతెన నిర్మాణం

జల్లివారిగూడెం, ములకనపల్లి మధ్య కట్టముడి వాగుపై వంతె నిర్మాణానికి 2018-19 ఆర్థిక సంవత్సరంలో నిధులు మంజూరయ్యాయి. వంతెన నిర్మాణంతో తమ రాకపోకల కష్టాలన్నీ తొలగిపోతాయని ఆయా గ్రామస్తులు ఎంతగానో ఆనందం వ్యక్తం చేశారు. అయితే పనులు ప్రారంభించినా, కొనసాగించకుండా నిలిపేయడం, నాలుగేళ్లవుతున్నా సంబంధిత కాంట్రాక్టర్ పత్తా లేకపోగా, దీనిపై అధికారులుగానీ, నేతలు గానీ స్పందించకపోవడంతో కట్టుమూడివాగుపై వంతెన నిర్మాణ ఆశలన్నీ ఆవిరైపోయాయని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. అసలు వంతెన నిర్మాణానికి మంజూరైన నిధులు ఉన్నాయా? లేకుంటే రద్దయిపోయాయా? లేక మళ్లిపోయాయా? కూడా చెప్పే దిక్కులేదని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, నేతలు స్పందించి, కట్టముడి వాగుపై వంతెన నిర్మాణం చేపట్టి, పూర్తిచేయడం ద్వారా తమ రాకపోకల కష్టాలు తొలగించాలని జల్లివారిగూడెం, ములకనపల్లి వాసులు కోరుతున్నారు.

బిజెపి నిరంకుశ విధానాలపై నిరసన

ప్రజాశక్తి -సీలేరు : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వం రద్దు, జైలుశిక్ష పడేలా కేసులు పెట్టడం ద్వారా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ నిరంకుశ విధానాలు, కక్షసాధింపు ధోరణులు పరాకాష్టకు చేరుకున్నాయని, అతి త్వరలో ప్రజలే నేలకు దింపుతారని డిసిసి కార్యదర్శి శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం సీలేరులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో దారకొండ, దుప్పిలివాడ, గుమ్మరేవులకు చెందిన కాంగ్రెస్ ముఖ్యనేతలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, రాహుల్‌గాంధీ ఎంపీ సభ్యత్వం రద్దు, జైలుశిక్ష విధించడాన్ని ఖండిస్తూ, నిరసన వ్యక్తంచేశారు. కుట్రలు కుతంత్రాలతో కాంగ్రెస్ నేతలను బిజెపి ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. వారి తాటాకు చప్పుళ్లకు వంద ఏళ్ల చరిత్ర గలిగిన కాంగ్రెస్ పార్టీ బెదిరే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. బిజెపి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక నిరంకుశ విధానాలను ప్రజలు గమనిస్తున్నారని, అతి త్వరలో ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో సీలేరు, దుప్పిలివాడ, దారకొండ, గుమ్మిరేవులు గ్రామాల కాంగ్రెస్‌నేతలు వి.అప్పారావు ఎం .సత్తిబాబు, అల్లంకి రాజు, సొన్ను మల్లు దొర, రాంబాబు, చిన్నబ్బాయి, బాబురావు, రామచంద్రరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిసిసి కార్యదర్శి శ్రీనివాసరావు

గురువులకు ఘనసత్కారం

గురువులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992 పదోతరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం అప్పట్లో తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు, స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్న వారంతా పరస్పర యోగక్షేమాలను తెలుసుకుని రోజంతా సందడిగా గడిపిరాఉ. బైక్‌పై ర్యాలీగా గ్రామమంతా కలియతిరిగారు. ఇలాగే ఏటా కలుసుకోవాలని నిర్ణయంచారు. పూర్వ ఉపాధ్యాయులు టివి శర్మ, వీరభద్రరావు, తదితరులను పూలమాలలు వేసి, దుశ్శాలువాతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కొంపెల్ల శ్రీనివాసశర్మ, పిడపర్తి శ్రీనివాస్, పట్నాల ప్రసాదరావు, బోయినపల్లి ప్రసాద్, బోయినపల్లి నాగేశ్వరరావు, కుంజం సత్యనారాయణ, పప్పు మారుతీకిషోర్, అధికారి సత్యనారాయణ, నారపరెడ్డి సత్యనారాయణ, పాపాని అప్పారావు, అల్లం వీర విజయ కుమార్ పాల్గొన్నారు.

31న మన్యం బంద్‌ను జయప్రదం చేయండి

గిరిజన సంఘం జాతీయ నాయకులు అప్పలనర్స

మాట్లాడుతున్న అప్పలనర్స

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: బోయ/వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చవద్దని ఆంధ్ర ప్రదేశ్ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 31న మన్యం బంద్ చేపడుతున్నట్లు ఆ సంఘం జాతీయ నాయకులు పి.అప్పలనర్స పిలుపునిచ్చారు. స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అసెంబ్లీలో దుర్మార్గంగా గిరిజన జాతిని అణగదొక్కే విధంగా బీసీలైన బోయ/వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు తీర్మానం చేసిందన్నారు. జీవో 3 రద్దు చేసి కేంద్ర ప్రభుత్వం గిరిజనులకి తీవ్రమైన అన్యాయం చేసిందని, ఇప్పుడు రాష్ట్రంలో సిఎం జగన్ ఈ నిర్ణయం తీసుకోవడం దుర్మార్గమన్నారు. ఈ విషయమై అసెంబ్లీ సమావేశంలో గిరిజన ఎమ్మెల్యేలు, ఎంపీలు మౌనం వహించడం తగదన్నారు. భవిష్యత్తులో వైసిపి ప్రజాప్రతినిధులకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గర పడ్డాయని తెలిపారు. అధికారం చేపట్టిన నాటి నుండి కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం గిరిజనులకు వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటూ తీవ్ర అన్యాయం చేస్తున్నాయని విమర్శించారు. ఈ నెల 31న జరిగే మన్యం బంద్‌కు పెద్ద ఎత్తున గిరిజన యువత, ఉద్యోగులు, మేధావులు, కార్మికులు, మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో భాషా వాలంటీర్ సంఘం రాష్ట్ర నాయకులు కుమారి, యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి వి మహేష్, గిరిజన యువజన సంఘం నాయకులు నాగేంద్ర, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షులు పి.బాలదేవ్, ఉపాధి హామి వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్‌బి పోతురాజు, తదితరులు పాల్గొన్నారు.

తీర్మానాన్ని రద్దు చేయాలి: పడాల్

పాడేరు: బీసీ -ఏలుగా ఉన్న బోయ/వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేరుస్తూ రాష్ట్ర క్యాబినెట్ చేసిన తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 31న తలపెట్టిన రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేయాలని గిరిజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బోనంగి చిన్నయ్య పడాల్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం చింతపల్లి గిరిజన సంఘం కార్యాలయంలో జికే వీధి, చింతపల్లి మండలాల గిరిజన సంఘం నేతల అత్యవసర సమావేశం అమ్మవారి దారకొండ ఎంపీటీసీ అంపురంగి బుజ్జిబాబు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, గిరిజన తెగలకు ఇది చీకటి రోజు అని అభివర్ణించారు. ఏపీ సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష హోదాలో ఉన్నప్పుడు గిరిజనుల పక్షాల మాట్లాడిన మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రాజకీయ ప్రయోజనాలకు గిరిజన హక్కుల, చట్టాలను పణంగా పెడుతున్నారని విమర్శించారు. గిరిజన చట్టాలను కాలరాస్తున్న ప్రభుత్వాల మూలంగా ఏజెన్సీ ప్రాంతాల్లో 1/70 చట్టం నామమాత్రంగా మిగిలిందన్నారు. జీవో 3 గిరిజనుల ఉద్యోగాలకు సంబంధించిన అంశమని, దీన్ని రద్దు చేసి సంవత్సరాలు కావస్తున్నా అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం కనీసం పిల్ కూడా దాఖలు చేయలేదని మండిపడ్డారు. గిరిజన చట్టాలు పటిష్టంగా ఉన్నా పరిపాలించే వారి చేతిలో పెత్తనం ఉన్నంత వరకు గిరిజనులకి అన్యాయం తప్ప మరొకటి జరగదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి గిరిజన సలహా మండలి ఎమ్మెల్యేల అభిప్రాయం తెలుసుకోకుండా ఏకపక్ష తీర్మానం చేయడం చట్టరీత్య నేరమని ముఖ్యమంత్రి తెలియదా అని ప్రశ్నించారు. 31న జరుగుతున్న రాష్ట్ర బందును అన్ని వర్గాల ప్రజలు జయప్రదం చేయడమే కాకుండా స్వచ్ఛందంగా పాల్గొని మద్దతు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. అప్పటికి రాష్ట్ర ప్రభుత్వం దిగి రాకపోతే ప్రత్యామ్నాయ్య ప్రత్యక్ష పోరాటాలకి సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాంగి ధనుంజయ్, జిల్లా సహాయ కార్యదర్శి సాగిన చిరంజీవి, కో ర్ర బాలయ్య, అమ్మవారి దారకొండ వైఎస్ సర్పంచ్ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ముర్ల చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ తీర్మానం వెనక్కి తీసుకోవాలి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: గిరిజనుల హక్కులు, చట్టాల పరిరక్షణ వేదిక జాయింట్ యాక్షన్ కమిటీ (జెఎసి) ఈ నెల 31న రాష్ట్రవ్యాప్త మన్యం బంద్‌కు పిలుపునిచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం బోయ, వాల్మీలకు ఎస్‌టి జాబితాలో చేర్చాలనే అసెంబ్లీ తీర్మానం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఆదివారం అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులోని గిరిజన భవన్‌లో ఎస్‌టిల్లో ఇతర కులాలను చేర్చాలని వైసిపి ప్రభుత్వం చేసిన అసెంబ్లీ తీర్మానంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఇతర కులాలను ఎస్‌టిల్లో చేర్చాలని అసెంబ్లీ తీర్మానాన్ని నిరసిస్తూ జెఎసి ఈ మేరకు కార్యాచరణను మీడియాకు విడుదల చేసింది. ఈనెల 27న జిల్లా, డివిజన్, మండల కేంద్రాల్లో అధికారులకు వినతి పత్రాలు ఇవ్వడం, 28, 29, 30న రాష్ట్రవ్యాప్త మన్య బంద్ పై గ్రామాల్లో ప్రచారం, 31న రాష్ట్రవ్యాప్తంగా మన్యం బంద్, ఉదయం, మధ్యాహ్నం వంటావార్పు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ సందర్భంగా ఆదివాసి జెఎసి నాయకులు రామారావుదొర, ముఖి శేషాద్రి మాట్లాడుతూ, గిరిజనుల మనుగడకు వ్యతిరేకంగా అసెంబ్లీ తీర్మానంపై గిరిజన ప్రాంత ఎంపి, ఎమ్మెల్యేలు మౌనం ఎందుకని ప్రశ్నించారు. బోయ వాల్మీకిలను ఎస్ టిల్లో చేర్చే అసెంబ్లీ తీర్మానానికి మద్దతు పలికిన గిరిజన వైసిపి ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అభివాదం చేస్తున్న జెఎసి నేతలు

శ్రీరామనవమి వేడుకలకు శ్రీకారం

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం సీలేరు రామాలయం సెంటర్‌లో శ్రీరామనవమి వేడుకలకు ఆదివారం ముహూర్తపు రాట వేశారు. ముఖ్య అతిథులుగా ఎపి జెన్‌కో ఎస్‌ఇ (సివిల్) కెకెవి. ప్రశాంత్‌కుమార్, ఇఇ ప్రభాకర్ దంపతులు పాల్గొని, పూజా కార్యక్రమాలు నిర్వహించి, అనంతరం ముత్తైదువులతో ముహూర్తపు రాట వేయించారు. రు. ఈనెల 30న శ్రీరామ నవమి వేడుకలకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పిల్లా సాంబమూర్తి, పిల్లా రమణ, బి. లక్ష్మణ్ తెలిపారు.

టూ వీలర్ మెకానిక్‌లను అసంఘటిత రంగ కార్మికులుగా గుర్తించాలి

ప్రజాశక్తి -గాజువాక : టూ వీలర్ మెకానిక్‌లను అసంఘటిత రంగ కార్మికులుగా గుర్తించాలని ఆంధ్రప్రదేశ్ టూ వీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి.రాము రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గాజువాకలో ఆదివారం ప్రగతి టూ వీలర్ మెకానిక్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ, అసోసియేషన్ సహకారంతో రాష్ట్ర స్థాయి సంఘంలో సభ్యత్వం తీసుకొని గుర్తింపు కార్డులు పొందాలన్నారు. దీని ద్వారా మెకానిక్‌లకు అనేక ఆర్థిక ప్రయోజనాలు అందుతాయని తెలిపారు. టూ వీలర్ మెకానిక్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి అప్పారి విష్ణుమూర్తి మాట్లాడుతూ, భవన నిర్మాణ కార్మికులకు వర్తించే అన్ని పథకాలను టూ వీలర్ మెకానిక్‌లకు వర్తింప చేయాలని కోరారు. అసోసియేషన్ బలోపేతానికి మెకానిక్‌లంతా అండగా నిలవాలన్నారు. అనంతరం అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రామును సత్కరించారు. ఈ సమావేశంలో స్థానిక అసోసియేషన్ అధ్యక్షుడు జి.దామోదర్‌రావు, వంగపండు గణేష్ , రెడ్డిపల్లి రాజు, జి.వెంకటేశ్వరరావు, చంటి, సోమేష్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక సంబరాలు

ప్రజాశక్తి-సీతమ్మధార : మల్లికా మాధుర్య స్వరాలు కల్చరల్ అసోసియేషన్ పంచమ వార్షికోత్సవం సందర్భంగా ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయంలో నిర్వహించిన సాంస్కృతిక సంబరాలు ఆకట్టుకున్నాయి. వివిధ రంగాల్లో సేవలందిస్తున్న కళా సేవకులను సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు నన్నపనేని మల్లికా చౌదరి నేతృత్వంలో సత్కరించారు. కార్యక్రమంలో కె.కోటపాడు సబ్ రిజిస్ట్రార్ బంగారి వెంకటేశ్వరరావు, రైటర్స్ అకాడమి ఛైర్మన్ వివి రమణమూర్తి, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, వ్యాఖ్యాత పి.రాజేంద్రప్రసాద్, సినీ నటుడు ఆర్.యాదకుమార్, కళా రంగ ప్రతినిధులు మహ్మద్‌ఖాన్, చెన్నా తిరుమలరావు, మస్తాన్‌రెడ్డి, సన్‌మూర్తి, జెఎంఆర్ నెహ్రూ తదితరులు ప్రసంగించారు. తొలుత జరిగిన సంగీత విభావరిలో కెఎస్.ప్రకాష్, మల్లిక పాడిన ఈమూగ చూపేలా, రైల్వే రమణ, మల్లిక పాడిన చల్లని గాలి, చంద్రశేఖర్ పాడిన రింజిమ్ రింజిమ్ హైదరాబాద్, బొమ్మిడి సత్యనారాయణ, శ్వేత పాడిన దంచవే మేనత్త కూతురా, సింహాచలం, మల్లిక పాడిన ఒక్క సారి చెప్పలేవా వంటి గీతాలు ఆహూతులను అలరించాయి.

బోయ/వాల్మీకిలను ఎస్‌టిలో చేర్చడంపై ఆందోళనలు

కొవ్వొత్తులతో ర్యాలీ చేపడుతున్న నేతలు

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు:బోయ/వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీలో తీర్మానాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని మండల కేంద్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘ నాయకులు శనివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఉద్యోగ, ఉపాధ్యాయుల సంఘం నాయకులు మాట్లాడుతూ, రాష్ట్ర వైసిపి ప్రభుత్వాన్ని ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా ఖండిస్తూ రాబోయే ఎన్నికల్లో వైసిపి రూపు రేఖలు లేకుండా చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. 40 లక్షల మందిని ఎస్టీ జాబితాలో చేర్చడం పై ఆగ్రహం వ్యక్తపరుస్తూ కనీసం గిరిజనులపై చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. గిరిజన ప్రాంతంలో ఉన్న భూగర్భ కనీస సంపద దోచు కోవటానికే ప్రణాళికలు రచించి బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని తీర్మానించారు తప్ప మరొకటి లేదని తీవ్రంగా విమర్శించారు. కొవ్వొత్తుల ర్యాలీ కార్యక్రమానికి మండల తెలుగుదేశం పార్టీ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్, డిటిఎఫ్, ఏపిటిటిఆర్, సిఐటియు, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ సంఘ నాయకులు పాల్గొన్నారు.

మండలంలో లక్ష్మీపురం గ్రామపంచాయతీ హెడ్ క్వార్టర్ లో స్థానిక సర్పంచ్ కొర్ర త్రినాథ్ పంచాయతీ పరిధిలోని యువతతో శనివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీలో జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన బోయ వాల్మీకిలకు ఎస్టీ జాబితాలో చేర్పిస్తామని ప్రవేశ పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 40 లక్షల బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్పిస్తే గిరిజన ప్రాంతంలో గిరిజనుల మనుగడ కనుమరుగైపోతుందని మండిపడ్డారు. అన్ని విధాలుగా స్థిరపడిన బీసీ కేటగిరి బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో ఎలా చేర్పిస్తారని మండిపడ్డారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో ప్రజాసంఘాలతో, యువతతో చైతన్యపరచి భారీ ఎత్తున నిరసనలు, ర్యాలీలు, రాస్తారోకోలు, కార్యాలయం ముట్టడిలు చేపడతామని హెచ్చరించారు.

మండలంలో నక్సల్ ప్రభావిత ప్రాంతమైన వనగుమ్మ పంచాయతీ గ్రామ సచివాలయం ఎదుట మండల సిఐటియు కార్యదర్శి కుర్ర శంకర్రావు ఆధ్వర్యంలో పంచాయతీ యువతతో నిరసన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎస్టీ జాబితాలో బోయ వాల్మీకిలకు చేర్పించే తీర్మానం దుర్మార్గమని ఖండించారు. గిరిజన ప్రాంతంలో నివసిస్తున్న ఎస్టి ఉప తెగల వారికి కేటాయించిన ఎస్సీ, ఎస్టి సప్తై నిధులు దారి మళ్లించి ఆదివాసుల అభివృద్ధికి తూట్లు పొడుస్తూ గిరిజన అభివృద్ధికి తుంగలో తొక్కుతున్నారని మండిపడ్డారు. ఇప్పుడు ఎస్టీ జాబితాలో బోయాలకు చేర్పించి గిరిజన ప్రాంతంలో భూగర్భ ఖనిజ సంపద దోచుకోవడానికే ప్రణాళిక సిద్ధం చేశారని, వైసిపి ప్రభుత్వం చేపట్టిన ప్రణాళికాలను వెనక్కి తీసుకొని గిరిజనులకు అభివృద్ధి బాటలో నడిపించాలని లేని పక్షంలో రాబోయే ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తీర్మానం ఉపసంహరించుకోవాలి : జెడ్‌పిటిసి గంగరాజు

అరకులోయ రూరల్:బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని చేసిన తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అనంతగిరి జెడ్పీటీసీ ధీసరి గంగరాజు ఆధ్వర్యాన స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుండి నాలుగు జంక్షన్ వరకు విద్యార్థులతో కలిసి ఆదివారం ధర్నాను చేపట్టారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ గంగరాజు మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బోయవాల్మీలను ఎస్టీ జాబితాలో చేర్పించే తీర్మానంపై ఉన్న ప్రేమ 5వ షెడ్యుల్ ఏరియాలో ఉన్న గిరిజనులకు రక్షణ కవచంగా ఉన్న నూటికి నూరు శాతం ఉద్యోగులు ఇచ్చే జిఓ 3పై సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేసేందుకు ఎందుకు లేదన్నారు. ఎస్టీ జాబితాలో చేర్చేటప్పుడు మన గిరిజన ఎమ్మెల్యేలు కనీసం నోరెత్తి మాట్లాడలేదని మండిపడ్డారు. మైదాన ప్రాంతంలో ఉన్న (బిసి ఎ) బోయ బెంతు ఒరియాలను ఎస్టీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానాన్ని ఆమోదించడం గిరిజన ద్రోహులుగా మిగిలారన్నారు. రాజ్యాంగ బద్ధంగా ఉన్న గిరిజన హక్కులు, చట్టాలు, రిజర్వేషన్లు కాలక్రమేణలో ప్రభుత్వమే కాల రాస్తుందన్నారు. గిరిజన సంఘాలు, ప్రజా సంఘాలు, గిరిజనులు కలిసి వేదికపై వచ్చి ఉద్యమాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ మండల అధ్యక్షులు సీమోన్, ఆదివాసీ జేఏసీ నాయకులు ఎల్బి కామేశ్వరరావు, ప్రసాద్,రాజు, అనంతగిరి గిరిజన సంఘం కార్యదర్శి జన్ని సుబ్బారావు, పాంగి రవీంద్ర, జన్ని గుండు, జన్ని భాస్కరావు, సురేష్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న గంగరాజు, నేతలు

వైఎల్.నర్సింగరావు దంపతులను సత్కరించి జ్ఞాపిక అందజేస్తున్న సిహెచ్.నర్సింగరావు

ప్రజా వైద్యులు వైఎల్.నర్సింగరావుకు ఘన సన్మానం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్ర మెడికల్ కాలేజీ గైనకాలజీ విభాగాధిపతి, ప్రజా వైద్యులు డాక్టర్ వైఎల్.నర్సింగరావు దంపతులను అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎపి మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ కె.సత్య వరప్రసాద్ మాట్లాడుతూ ఆంధ్ర మెడికల్ కాలేజీకి వైఎల్.నర్సింగరావు చేసిన సేవలను కొనియాడారు. మరొక ముఖ్య అతిథి సిపిఎం సీనియర్ నాయకులు సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ వైఎల్.నర్సింగరావుతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. పేదలకు ఆయన వైద్యపరంగా ఎంతగానో సేవలందించారని కొనియాడారు. అటువంటి వారి సేవలు ఉద్యోగ విరమణతో ముగిసిపోకూడదని, మరింతకాలం ప్రజా సేవలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విమ్స్ డైరెక్టర్ కె.రాంబాబు, అల్లూరి విజ్ఞాన కేంద్రం కోశాధికారి పద్మనాభరాజు, ఆరోగ్య విభాగం బాధ్యులు కామేశ్వరరావు పాల్గొన్నారు. సన్మాన కార్యక్రమానికి ముందు హెచ్3ఎన్2, కోవిడ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆంధ్ర మెడికల్ కాలేజ్ అసోసియేట్ ప్రొఫెసర్ పిజె.శ్రీనివాస్, పల్మనాలజిస్ట్ డాక్టర్ కె.ఫణీంద్ర ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఎవికె ఆరోగ్య విభాగం హెడ్ టి.కామేశ్వరరావు అధ్యక్షత వహించారు.



క్రెడాయ్ నూతన కార్యవర్గ సభ్యులు

క్రెడాయ్ ఆంధ్రప్రదేశ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : క్రెడాయ్ ఆంధ్రప్రదేశ్ 4వ వార్షిక జనరల్ బాడీ సమావేశం ఆదివారం విశాఖలోని ఫెయిర్‌ఫీల్డ్ మారియట్ హోటల్‌లో జరిగింది. ఈ సమావేశం అనంతరం క్రెడాయ్ ఆంధ్రప్రదేశ్ మేనేజింగ్ కమిటీ ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే ఎన్నికలను నిర్వహించడానికి ఐదుగురితో ఎన్నికల కమిటీని ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా జరిగిన ఎన్నికల్లో 2023-25కిగాను క్రెడాయ్ ఆంధ్రప్రదేశ్ కొత్త ఆఫీస్ బేరర్లను ఎన్నుకున్నారు. నూతన చైర్మన్‌గా ఆళ్ల శివారెడ్డి (గుంటూరు), అధ్యక్షులుగా వైవి.రమణారావు (విజయవాడ), ప్రధాన కార్యదర్శిగా బయన శ్రీనివాస్ (విశాఖపట్నం), ఉపాధ్యక్షులుగా జివిఎస్‌టి.రాయుడు (కర్నూలు), కె.సుభాష్ చంద్రబోస్ (విజయనగరం), జె.సురేష్ కుమార్ రెడ్డి (కర్నూలు), కోశాధికారిగా పి.రాజశేఖర్‌రావు (తిరుపతి), సంయుక్త కార్యదర్శులుగా వి.భీమశంకర్ (రాజమండ్రి), కె.రమేష్ అంకినీడు (విజయవాడ) ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సభ్యులందరి మద్దతు, సహకారంతో క్రెడాయ్ లక్ష్యాలను ముందుకు తీసుకెళ్తామన్నారు. పూర్వ కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.

రైతు గోడు పట్టదా..?

విశాఖ జిల్లాలో రైతు బజార్లపై అధికారుల పెత్తనం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రైతు బజార్లలోని ఆకుకూరలు, పళ్లు, కూరగాయల స్టాల్స్‌పైనా, ధర నిర్ణయంపైనా రైతులపై అధికారుల పెత్తనం కొనసాగుతోంది. తన కుటుంబాన్ని పోషించుకోడానికి రైతు బజార్లకు వచ్చి మార్కెట్ చేసుకుని సాయంత్రానికి ఇంటికి వెళ్లాలనుకునే రైతులకు కనాకష్టంగా బజార్లు మారిపోతున్నాయి. విశాఖ నగరంలోని రైతు బజార్లకు కోడి కూయక ముందే రైతులు సరుకులతో వచ్చి తక్కువ ధరకు విక్రయాల ద్వారా అన్ని తరగతుల ప్రజానీకం అభిమానాన్నీ చూరగొంటున్నారు. ఒకప్పుడు ఉచితంగా స్టాల్స్ పెట్టుకునే అవకాశం ఉండేది. నేడు కనీసం రూ.3 వేలు చెల్లించకపోతే స్టాల్ దొరకని పరిస్థితి నెలకొంది. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను రైతు బజార్లోకి తెచ్చి విక్రయించడం ఒక ఎత్తయితే ఇటు ప్రభుత్వ అధికారులు తీసుకుంటున్న నిర్ణయాలతో వారు చిత్తవుతుండటం బాధాకరం. ప్రజల రోజువారీ జీవనంలో రైతు బజార్లు భాగమైపోతున్న క్రమంలో రైతులను మాత్రం సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. రైతు ఎవరికైనా ఒక కార్డు ఉంటే ఆయన తరపున ఒక నామినీని పెట్టుకునే సౌలభ్యం గతంలో ఉంది. ఎందుకంటే ఒక్కరే రోజంతా అక్కడ ఉండలేరు. ఇంటిల్లిపాదిని పోషించుకోవడానికి రైతులు కష్టపడాల్సి ఉంది. ఏదైనా అనారోగ్యం, ఇతర విపత్కర పరిస్థితి వల్ల కార్డుదారుడైన రైతు మరణిస్తే ఆ కుటుంబం రోడ్డున పడకుండా నామినీకి అవకాశం వచ్చేది. తాజాగా ఈ అవకాశం లేకుండా విశాఖలోని రైతు బజార్లలో అధికారులు నిర్ణయం తీసుకోవడం రైతులకు శరాఘాతంగా మారింది. ఎంవిపి, సీతమ్మధార రైతు బజార్లలో పలువురు రైతులు ఈ వషయంపై విముఖత వ్యక్తం చేస్తున్నారు. కాలానుగుణంగా పంటలను రైతులు రైతు బజార్లలోకి తీసుకొస్తుండడం తెలిసిందే.

ఎంవిపి రైతు బజారులో అమ్మకాలు సాగిస్తున్న రైతులు

బొప్పాయి, శనక్కాయలు, పండు మిరప, స్వీట్‌కార్న్, పుట్టగొడుగులు, తదితరాలను తీసుకొచ్చి విక్రయాలు జరుపుతూ కుటుంబాలను పోషించుకుంటున్నారు.

తాజాగా ఇక్కడ స్టాల్స్‌కు అద్దె చెల్లించడం తలకుమించిన భారంగా వారికి పరిణమించింది. రోజువారీగా ఒక రైతు అమ్మే కూరగాయలు కాకుండా కొత్తగా ఏదైనా సరుకు జోడించి అమ్మితే రైతుపై ఆర్థిక భారాన్ని ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు మోపుతున్నారు. అదనంగా మరో రూ.3 వేలు చెల్లించాలంటున్నారు. ఈ నిర్ణయం రైతులను తీవ్రస్థాయిలో వేధింపులకు గురిచేస్తోంది. రోజంతా కష్టపడుతున్నా రూ.500 నుంచి రూ.600లే మిగులుతోందని, వాటిలో స్టాల్స్ అద్దెలకే ఎక్కువ మొత్తం పోతోందని పలువురు వాపోతున్నారు.

తెలుగు నేల కళలకు పుట్టినిల్లు

సినీ సంగీత దర్శకుడు థమన్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : తెలుగు నేల కళలకు పుట్టినిల్లు అని సినీ సంగీత దర్శకుడు ఎస్ఎస్ థమన్ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంతో సెయింట్ లూక్స్ సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఆడియో ఇంజినీరింగ్, మ్యూజిక్ ప్రొడక్షన్ స్టూడియోను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ నగర కేంద్రంగా సంగీతానికి ఉపయుక్తంగా ఇంతటి భారీ స్టూడియో నిర్మాణం చేయడం పట్ల వర్సిటీ అధికారులను అభినందించారు. ఆంధ్రరాష్ట్రం ఎందరో ప్రఖ్యాత కవులు, నటులు, సంగీత కారులకు జన్మస్థలమన్నారు. ఇక్కడి భాష, యాస తమకు ఎంతో స్ఫూర్తిని అందిస్తాయన్నారు. తన విశ్రాంత జీవితాన్ని విశాఖ నగరంలో గడపడానికి ఇష్టపడతానన్నారు. భీమిలిలో తాను మ్యూజిక్ రికార్డింగ్ స్టూడియో నిర్మించే ఆలోచనలో ఉన్నానన్నారు. తనకు తల్లిదండ్రుల నుంచి సంగీతం వారసత్వంగా వచ్చిందన్నారు. సాంకేతికత అందుబాటులోకి రావడంతో నూతన గాయకులు పరిచయం అవుతున్నారన్నారు. సంగీతం ఉన్న ప్రదేశంలో గొడవలు ఉండవని, మ్యూజిక్ ప్రశాంతతను చేకూరుస్తుందని అన్నారు. మెదడుకు ఆక్సిజన్‌గా సంగీతం నిలుస్తుందన్నారు. సంగీతకారులు ఎక్కువ కాలం జీవిస్తారని తెలిపారు.

అనంతరం విద్యార్థుల కోరికతో నిన్నిలా...నిన్నిలా...చూసానే అంటూ పాటపాడి ఉర్రూతలూగించారు. ఎయు విసి ఆచార్య పివిజిడి ప్రసాద రెడ్డి మాట్లాడుతూ తొలి దశలో రూ.3.5 కోట్లు వెచ్చించి రికార్డింగ్ స్టూడియో, ప్రాక్టికల్ ట్రైనింగ్ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు ఒత్తిడి నుంచి ఉపశమనం పొందడానికి, సంగీత రంగంలో రాణించడానికి అవసరమైన కోర్సులను అందిస్తామన్నారు. అన్ని విభాగాల విద్యార్థులూ ఈ కోర్సులు చేసే విధంగా అవకాశం కల్పిస్తామన్నారు. అనంతరం వర్సిటీ తరపున థమన్‌ను సత్కరించారు. కార్యక్రమంలో సంగీత దర్శకుడు, ఆశీర్వాద్ లూక్స్, సెయింట్ లూక్స్ విద్యా సంస్థల అధినేత ప్రీతం లూక్స్, ఆచార్య సరస్వతి విద్యార్థి, జేమ్స్ స్టీఫెన్, టి.షారోన్‌రాజు, ఎకెఎం.పవార్ పాల్గొన్నారు. పెద్దసంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు.

స్టూడియో ప్రారంభోత్సవంలో పాల్గొన్న సంగీత దర్శకుడు థమన్

వ్యూ పాయింట్ వద్ద మంత్రులు, జిల్లా అధికారులు

సీతకొండ.. ఇక నుంచి వైఎస్ఆర్ వ్యూ పాయింట్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జోడుగుళ్లపాలెం నుంచి సాగర్ నగర్ బీచ్‌కు వెళ్లే మార్గంలోగల సీతకొండ ప్రాంతానికి వైఎస్ఆర్ వ్యూ పాయింట్‌గా నామకరణం చేసి రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, రాష్ట్ర ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి విడదల రజని, రాష్ట్ర పారిశ్రామిక, ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, విశాఖ నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి ఆదివారం ప్రారంభోత్సవం చేశారు. విశాఖ నగరంలో ఈ నెల 28, 29 తేదీల్లో ప్రతిష్టాత్మకంగా జరగనున్న జి - 20 సదస్సు నిర్వహణలో భాగంగా నగరంలో పలు చోట్ల అభివృద్ధి పనులు, సుందరీకరణ పనులు చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో సీతకొండనూ అందంగా తీర్చిదిద్ది పేరు మార్పు చేశారు. అనంతరం వ్యూ పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన 'ఐ లవ్ వైజాగ్' సెల్ఫీ పాయింట్‌ను ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి సురేష్ మాట్లాడుతూ ఈ వ్యూ పాయింట్‌ను సుమారు 2 కోట్లా 40 లక్షల రూపాయలతో జివిఎంసి అభివృద్ధి చేసిందన్నారు. దేశ విదేశాల నుంచి వస్తున్న విహార యాత్రికులకు దేశంలోనే ఒక ప్రత్యేక పర్యాటక ప్రాంతంగా విశాఖ నగరాన్ని చూపించాలనే రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆశయం మేరకు విశాఖ నగరాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. మంత్రి రజని మాట్లాడుతూ సముద్ర తీర ప్రాంతంలోని సాగర్ నగర్ బీచ్, దుర్గా టెంపుల్, గుడ్లవానిపాలెం బీచ్, జోడుగుళ్లపాలెం బీచ్‌లను అభివృద్ధి చేశామన్నారు. గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ తీర ప్రాంతాలను ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకూ దఫదఫాలుగా అభివృద్ధి పరుస్తున్నామన్నారు. మేయర్ హరి వెంకట కుమారి మాట్లాడుతూ కైలాసగిరి రోప్ వే నుంచి తిమ్మాపురం వరకు 11 కిలోమీటర్ల మేర రోడ్లకు ఇరువైపులా ఫుట్‌పాత్‌ల మరమ్మతులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో స్పెషల్ సిఎస్ శ్రీలక్ష్మి, విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు, పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, 9వ వార్డు కార్పొరేటర్ కోరుకొండ వెంకటరత్న స్వాతి దాస్, వైసిపి నాయకులు గొలగాని శ్రీనివాస్, కార్పొరేటర్ విపిన్ జైన్, జివిఎంసి ప్రధాన ఇంజినీర్ పి.రవికృష్ణరాజు, అదనపు కమిషనర్లు వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, వర్మ పాల్గొన్నారు.

28న నగరానికి సిఎం రాక

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జి 20 సదస్సులో పాల్గొనేందుకు సిఎం జగన్మోహన్ రెడ్డి ఈ నెల 28న విశాఖ నగరానికి రానున్నారు. ఆయన పర్యటన వివరాలను సిఎం అదనపు ప్రత్యేక కార్యదర్శి కె.నాగేశ్వర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ నెల 28 మంగళవారం సాయంత్రం 4:20 గంటలకు విజయవాడ నుంచి ప్రత్యేక విమానంలో సిఎం బయలుదేరి 5:15 గంటలకు విశాఖపట్నం చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా రాడిసన్ బ్లూ హోటల్‌కు వెళ్తారు. రాత్రి 7 గంటలకు జి 20 విదేశీ ప్రతినిధులతో కలిసి అక్కడే గాల డిన్నర్‌కు హాజరవుతారు. అనంతరం 8 గంటలకు రాడిసన్ బ్లూ హోటల్ నుంచి బయలుదేరి ప్రత్యేక విమానంలో 8:45 గంటలకు విజయవాడ చేరుకుంటారు.

జి-20 సదస్సుకు భారీ భద్రతా ఏర్పాట్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జి - 20 సదస్సు నేపథ్యంలో విశాఖ నగరంలో ఈ నెల 27, 28, 29, 30 తేదీలలో భారీ భద్రతా ఏర్పాట్లు చేశామని నగర పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ తెలిపారు. ఆదివారం మధ్యాహం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 1850 సివిల్ పోలీసు, 400 మంది అర్మడ్ రిజర్వు, 4 గ్రేహౌండ్స్ యూనిట్లు, 02 క్యుఆర్‌టి టీంలు, 6 స్పెషల్ పార్టీలు, 2 ఎపిఎస్‌పి ప్లటూన్లతో సుమారు 2500 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు. సదస్సు రోజుల్లో నగర వాసులు ఏ జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు.